ఒక క్షణం ఆలోచించండి. తీవ్రంగా ద్వేషించి, ఆవేశపడి టెన్షన్‌కు లోనయితే మీ శారీరక మానసిక ఆరోగ్యాలు పాడవడమే తప్ప, దానివల్ల ఎవరికీ ఏ లాభమూ లేదు. అలా చేసేకంటే, కాస్త సహనంతో తల్లిదండ్రులను పలకరించగలిగే మీరు సంతోషంగా వుండడమే కాక మీ పిల్లల దృష్టిలో కూడా మీ విలువ పెరుగుతుంది.

చాలామంది తమ తల్లిదండ్రులతో కోపంగా మాట్లాడకపోయినా తిట్టకపోయినా - నిర్లిప్తంగా ముభావంగా ప్రవర్తిస్తూ తమయొక్క అసంతృప్తిని తెలుపుతూ వుంటారు. ఇది అన్నిటికన్నా దారుణమైన పరిస్థితి.

ముసలి వయస్సులో ఏ వ్యక్తి ఐనా తనవాళ్ళు తనతో ఆప్యాయంగా మాట్లాడాలని, దగ్గరగా సన్నిహితంగా వుండాలని కోరుకుంటారు. వాళ్ళని తమ మౌనంతో ముభావంతో బాధపెట్టడం కసాయితనం కన్నా ఎక్కువ. మీరు మీ తల్లిదండ్రుల్కు దూరంగా వేరే ఊర్లో వున్న పక్షములో రోజూ ఫోన్ చేసి వాళ్లతో మాట్లాడక్కరలేదు. మర్యాద చెయ్యక్కర్లేదు.

వాళ్ళింకా జీవించి వున్నారనే విషయం మీకు గుర్తున్నట్లు వాళ్ళకి, ప్రేమగా ఉత్తరాలు రాయడం ద్వారా వాళ్లని మీరు మరచిపోలేదని, ప్రేమిస్తున్నారని వాళ్ళకి తెలుస్తుంది. ఇలాగే మీ పిల్లవాడిని కూడా గౌరవించడం ద్వారా ఆనందింప చెయ్యవచ్చు. ఇంత చిన్న చిన్న విషయాలే వాళ్ళకి తృప్తిని కలుగజేస్తాయి.

మీ పిల్లవాడు పది పన్నెండేళ్ళు దాటిన వాడైతే, ఉదాహరణకి వాడి స్నేహితులను కూడా ఒక రోజు మీ ఇంటికి పిలిచి లంచ్‌గాని, డిన్నర్‌గాని ఇవ్వొచ్చు. ఎప్పుడూ మీ స్నేహితులు లేక మీ భార్య స్నేహితురాండ్రు యిళ్ళకొచ్చి అర్ధరాత్రి వరకూ పార్టీలు చేసుకుంటూ వుంటే మీ అబ్బాయి ఒంటరితనం ఫీలవుతూ వుంటాడు.

ఇలాంటి పార్టీలు తప్పనిసరైనప్పుడు మీ పిల్లవాడి 'కంపెనీ' కూడా ఎంటర్‌టైన్ చెయ్యవలసిన బాధ్యతమీది. అలాగే, మీ అబ్బాయి వాళ్ళ స్నేహితులింటికి ఏదైనా పార్టీకి వెళతానంటే, అదేదో చెడిపోయే కార్యంగా భావించి, వద్దని నిరాకరించకండి.

ఒక్క శృంగారంలో తప్ప మిగతా అన్ని విషయాలలోను మీ పిల్లలని వీలైనంతవరకూ కలుపుకుంటూ వుండండి. మీరంతా కలిస్తేనే ఒక కుటుంబం. ఆ తర్వాతే బయటవాళ్ళెవరయినా.

తిరిగి తల్లిదండ్రుల విషయానికొస్తే, మీ బాల్యంలో మీరు స్కూల్‌నించి రాగానే మిమ్మల్ని ప్రేమతో కౌగిలించుకున్న మీ తల్లిదండ్రులు, మీకే అనారోగ్యమో వస్తే మీ తల్లి మీకు చేసిన సేవలు - లాంటి మంచి జ్ఞాపకాలని గుర్తుచేసుకోండి. మీ తల్లిదండ్రులు మీకేదో చెయ్యలేదనే భావాన్ని విడిచిపెట్టి, వాళ్ళూ మీకు చేసిన సహాయాలని గుర్తుతెచ్చుకోండి.

ఏ మనిషీ పరిపూర్ణమైన వ్యక్తి కాదు

అలాగే తల్లిదండ్రులు కూడా.

"తల్లి అంటే శాంతానికి, సహనానికి మరో పేరులా వుండాలి. తల్లి అంటే అసలెప్పుడూ తప్పు చేయని వ్యక్తి. తల్లి అంటే కొడుకు కోసం తన గుండెనైనా కోసిచ్చే వ్యక్తి" - ఇలాంటివన్నీ మనం చిన్నప్పుడు పుస్తకాల్లో చదువుకుంటాం. కానీ, తల్లి కూడా ఒక స్త్రీయే. ఆమెకి సహజ మానవ గుణాలైన స్వార్థం, ద్వేషం, కోపం, అసూయ మొదలైనవి వుటాయి. వాటిని గుర్తించాలి.

మీరు మీ తల్లిని యేదో విషయం ప్రశ్నించారు. మీ తల్లి విసుక్కుంటూ ఏదో సమాధానం చెప్పింది. లేదా స్కూల్‌నుంచి ఇంటికొచ్చేసరికి తల్లి పక్కింటావిడతో కరివేపాకు గురించో, స్టీలుసామాన్లవాడితో కబుర్లు చెబుతూనో కనిపించింది. లేదు మీరు ఏదో చెప్పబోతుంటే గట్టిగా తిడితే మీరు మనసులోనే బాధపడతారు. ఇలా మూడు నాలుగు సార్లు జరిగితే మీ ఇద్దరిమధ్యా దూరం యెక్కువవుతుంది. మీరు పుస్తకాలలో చదివినదానికి, మనసులో అనుకున్న భావానికి, ఇప్పుడు జరుగుతున్నదానికి చాలా తేడా వుంటుంది. అయితే ఒక మనిషి విసుక్కోవటం గానీ, కబుర్లు చెప్పడం ద్వారా రిలాక్సవడంగాని అసమంజసం కాదు.

తల్లి అంటే సినిమాల్లో చూపిస్తున్నట్లుగా చాలా ఔన్నత్యంగా వుంటుందనుకోవడం పొరపాటు. సినిమాల్లో తల్లి వేషాలు వేసిన నటీమణులు తమ ఇళ్ళల్లో ఇంతకన్నా ఘోరంగా ప్రవర్తిస్తారు. ఏ లోపాలు లేని పరిపూర్ణమయిన వ్యక్తిత్వం కలిగి వుండాలనే అభిప్రాయమే సరియైనది కాదు. మీలో, మీ బంధువుల్లో, మీ మిత్రుల్లో వుండే లోపాలే మీ తల్లిదండ్రులలో కూడా వుంటాయి.

తల్లిదండ్రులతో భేదాభిప్రాయాలుకూడా అసహజమేమీ కాదు. కెరీర్ విషయంలోగాని, డబ్బులు యెలా ఖర్చుపెట్టాలి అనే విషయంలో అయితేనేమి, గదిని యెంత అందంగా అలంకరించుకోవాలి అన్న విషయంలో అయితేనేమి చాలా భేదాభిప్రాయాలు వస్తూ వుంటాయి. వాళ్ళ జనరేషన్ వేరు. మీ జనరేషన్ వేరు. వాళ్ళు మీకున్న అభిరుచులని, మీ అలవాట్లని, మీ స్నేహితులని అర్థం చేసుకోలేకపోయుండవచ్చు. మీకు వాళ్ళకి వున్నది తరం భేదమే తప్ప, వాళ్ళు మిమ్మల్ని అసహ్యించుకున్నట్లుగాని, మీ పరిస్థితులపట్ల కోపంగా వున్నట్లుగాగాని కాదు. వీలైనంతవరకూ వాళ్ళు అర్థం చేసుకోవడానికి వీలయ్యే విధంగా వివరించి చెప్పండి. రోజూ కనీసం పదిహేను నిముషాలు పాటైనా తల్లిదండ్రులతో మాట్లాడడం అనేదిఅలవాటు వుండాలి. ఒక పది నిమిషాలు మీరు వాళ్ళతో ఆహ్లాదకరంగా మాట్లాడితే ఆ అనుభూతి వాళ్ళకి పదిగంటలపాటు వుంటుంది.

'నేను ఎంత గౌరవించినా, ఎంత ప్రేమించినా మా అమ్మకూ నాన్నకూ ఎప్పుడూ అసంతృప్తే' అని కొందరంటారు. మరికొంత పెద్దవాళ్ళైతే నా పిల్లలని వాళ్ళు (నా

తల్లిదండ్రులు) అత్యంత గారాబంచేసి పాడుచేస్తున్నారు. పిల్లలని ఒళ్ళో కూర్చోబెట్టుకుని కబుర్లు చెబుతూ గంటల తరబడి కాలక్షేపం చేస్తున్నారు అని వాపోతుంటారు. మనసికంగా ఒంటరితనాన్ని అనుభవిస్తున్న వృద్ధులు తమ మానసిక స్థాయితో పిల్లలని సరిపోల్చుకుని దగ్గరపడాలని ప్రయత్నిస్తుంటారు. వాళ్ళిరువురూ ఒకే స్థాయిలో స్నేహంపట్ల స్పందిసతూ వుంటారు. దీన్ని మనం అర్థం చేసుకోవాలి. మీరు చెబుతున్న వాదనకూడా నిజమే అయియుండొచ్చు. మీ పిల్లలని ఏ విధంగా పెంచదల్చుకున్నారనే విషయాన్ని, మీ తల్లిదండ్రులకు అర్థం అయ్యే రీతిలో చెప్పండి చాలు. ఆఫ్టరాల్ వాళ్ళు మిమ్మల్ని పెంచి పెద్దచేసినవారు.

మీకు మీ తల్లిదండ్రుల మనస్తత్వం బాగా తెలిసి వుంటుంది. అలాగే మీ మనస్తతవం వాళ్ళకింకా బాగా తెలిసే వుంటుంది వాళ్ళకి నచ్చనిపనులు చేస్తే మీరు వాళ్ళని అగౌరపరిచేరనుకుంటారు. ఉమ్మడి కుటుంబాల్లో ఈ సమస్య ఎక్కువగా కన్పిస్తుంది.

అల్పసంతోషులైన తల్లిదండ్రులతో ఏ సమస్యా వుండదు. వాళ్ళని గుడికి తీసికెళ్ళినా, ఆస్పత్రికి తీసికెళ్ళినా చాలా సంతోషపడుతూ వుంటారు. మీరు ఆప్యాయంగా రాసే ఉత్తరాలకి కరిగిపోతారు.

మీకు ఏదైనా సమస్య వచ్చినప్పుడు మీ తల్లిదండ్రులను సంప్రదించండి. వాళ్ళిచ్చినసలహా మీరు పాటించారా లేదా అన్నది వేరే విషయం కేవలం సంప్రదిస్తే చాలు వాళ్ళు సంబరపడిపోతారు.

కొందరు తల్లిదండ్రులకి మీ పిల్లలకి వాళ్ళ పేరు పెట్టాలనే కోరిక వుంటుంది. దానివల్ల మీ కొచ్చిన నష్టమేమీ లేదు. మీరు మీ పిల్లలకి ఏ పేరైతే పెట్టదల్చుకున్నారో, దానికి మీ తల్లిదండ్రుల పేరు కలిపి నామకరణం చేసి రికార్డులలో మాత్రం మీకు ఇష్టమైన పేరు రాయించుకోవచ్చు. ఇది ఉభయత్రా ఆమోదనీయమైనది.

కొందరు తల్లిదండ్రులు పిల్లలనించి యేమీ ఆశించరు. పిల్లలు క్షేమంగా వుండి, అన్నీ మంచి పనులు చేస్తూ వుంటే చాలనుకుంటారు. మరికొందరు తల్లిదండ్రులని ఏ విషయమూ తృప్తిపరచదు. ఎన్ని వస్తువులు కొనిచ్చినా, ఎన్నిసార్లు యాత్రలకి పంపించినా, ఇంకా ఏదో తక్కు వైనట్లు భావిస్తూ కటువుగా మాట్లాడతారు. అటువంటి వాళ్ళని మార్చడం చాలా కష్టం. చిన్నతనంలో వాళ్ళు పొందిన అసంతృప్తినంతా మీ మీద చూపిస్తున్నారన్నమాట. అటువంటివాళ్ళని మార్చడానికి ఒకటే మార్గం. మీ వ్య క్తిత్వాన్ని మీరు నిలబెట్టుకుంటూ, మీ వైపునుండి పొరపాట్లు చెయ్యకుండా ప్రవర్తిస్తూ వుండడం.

'మా తల్లీ తండ్రీ మా కోసం ఏం చేశారని గౌరవించాలి? చిన్నప్పటినుండి ఒక్కసారైనా మా తండ్రి మమ్మల్ని ముద్దుగా చూసుకున్న పాపాన పోలేదు' అన్న పిల్లలని నేను చూశాను. వాళ్ళ సమస్యలు సమంజసంగానే వుంటాయి. కరక్ట్‌గానే వుంటాయి. ముఖ్యంగా తల్లిదండ్రులు దెబ్బలాడుకోవటం, వాటికి తామే ప్రత్యక్ష సాక్షి అవడం, వీళ్ళని యీ విధంగా తల్లిదండ్రుల

పట్ల నిరాసక్తులను చేస్తాయి. తల్లిదండ్రులు దెబ్బలాడుకొని, ఒకళ్ళతో ఒకళ్ళు మాట్లాడకుండా, ఇంటిని ఒక నిశ్శబ్ద యుద్ధరగంగా చేస్తే పిల్లలమీద ఆ ప్రభావం వుంటుంది. అలాగే తన కళ్ళ ముందే తల్లిని కొడుతున్న తండ్రిని ఏ పిల్లవాడూ సహించలేడు. ఇలాంటివన్నీ పిల్లలమీద చాలా చెడు ప్రభావాన్ని చూపిస్తాయి. ఇలాంటి పిల్లలు పెద్దవాళ్ళయిన తర్వాత తమ అసంతృప్తిని జీవిత భాగస్వాములమీద చూపిస్తూంటారు. నిత్యం అశాంతితో చిరాకుగా వుంటారు. తమలోని అశాంతిని, వేదనను, ఇన్‌ఫీరియారిటీ కాంప్లెక్స్‌ను మరిచిపోవడానికి తాగుడు, పేకాట, రేసులులాంటివి అలవాటు చేసుకుంటారు. ఒక తండ్రిగా మీ బాధ్యత ఎంతో ఒక కొడుకుగా మీ తండ్రిపట్ల కూడా మీకు అంతే బాధ్యత వుంది.

కష్టాల చుట్టూ కోటలు :

ప్రతి తండ్రీ తమ పిల్లలు సుఖంగా వుండాలనీ, వారికే కష్టం రాకూడదని కోరుకుంటారు. తాము పస్తులుండైనా సరే, పిల్లలకి పంచభక్ష్య పరమాణ్ణాలు పెట్టాలనుకుంటారు. ఇంకా డబ్బున్న తండ్రులైతే, కార్లలో స్కూల్‌కి పంపించి, వేసవిలో ఊటీ పంపించి అపురూపంగా చూసుకుటూ వుంటారు.

ఇలా గారాబంగా పెరిగితే పిల్లలు అసలు సమస్యలనేవి వుంటాయని ఊహించలేరు. భవిష్యత్తు గురించి బంగారు కలలు కంటూ వుంటారు. తోటి పిల్లల మధ్య తమ యొక్క సుపీరియారిటీ కాంప్లెక్స్‌ను చూపిస్తూవుంటారు. వాళ్ళ కలలు కల్లలుగా మారిపోతే, విధి వెక్కిరిస్తే ధైర్యాన్ని మనస్థయిర్యాన్ని పోగొట్టుకుంటారు. కొందరు పిల్లలు 'బ్రేక్' తట్టుకోలేక, చెడు అలవాట్లను, చెడు వ్యసనాలను చేసుకొని చెడు స్నేహాన్ని ఆశ్రయించి ఎస్కేపిస్టులవుతారు.

కష్టాలు, కన్నీళ్ళు, అగ్నిపరీక్షలు, జీవితంలో ఒక భాగం. వీటిని చిన్నప్పటినుంచే పిల్లలకు రుచి చూపించాలి. అలాగని - అట్లకాడతో వాట పెట్టమని, జైల్లో పది రోజులు వుండేటట్లు చూడమని కాదు. కనీసం ఒక్క సారైనా సిటీబస్‌లో ప్రయాణించని కుర్రవాడు, కారు పాడై సిటీబస్‌లోనో, ఆటోలోనో వెళ్ళవలసిన పరిస్థితి వచ్చినప్పుడు, ఆటోవాడితో ఎలా మాట్లాడాలో తెలియని పరిస్థితిలో ఉంటే - ఎలా వుంటుందో ఊహించండి.

మీ పిల్లవాడిని అంతటి లజ్జాపూరితమైన పరిస్థితిలోకి తోసింది మీరే. మన పిల్లలకు ఏ కష్టమూ, బాధా కలగకూడదని వాళ్ళని అనుక్షణం కాపాడుతూ వుంటే, మనం కష్టాలలో వున్నప్పుడు వాళ్ళు మనని ఏ విధంగానూ ఆదుకోలేరు. మహాభారతంలో పరీక్షిత్తు కథ చదివే వుంటారు. తన కొడుకైన పరీక్షిత్తుకి సర్పగండం వుందని తెలిసి, సర్పజాతినే నాశనం చెయ్యాలని సర్పయాగం చేస్తాడు. పరీక్షిత్తుని ఒంటిస్థంభం మేడలోవుంచి అతడికి ఇరవై నాలుగ్గంటలూ కాపలాపెట్టి మనుషులని నియమిస్తాడు. ఇన్ని జాగ్రత్తలు తీసుకొని, ఇక భయం లేదనుకొని వున్న సమయంలో తక్షకుడు చిన్న క్రిమిగా ఓ పండులో దూరి, పరీక్షిత్తు ఆ పండు తింటున్న సమయంలో పామై కాటు వేస్తాడు.

మన పిల్లలను ఏ కష్టమూ లేకుండా చూడాలని ఎంత జాగ్రత్తగా కాపాడినా - ఏదో ఒక క్షణంలో రావలసిన సమస్య రాకుండా పోదు. మన పిల్లలు సమస్యల్లో పడినప్పుడు మనం చెయ్యవలసిందేంటంటే - వాళ్ళనికించపరచకుండా, వాళ్ళు చేసిన పని తప్పని మాటిమాటికీ దెప్పిపొడవకుండా వాళ్ళు ఇరుక్కున్న సమస్యని మనం పరిష్కరించలేని నిస్సహాయస్థితి ఏదైనా వుంటే దానిని ప్రదర్శించకుండా, వాళ్ళకి తోడుగా అండగా నిలబడడం. వాళ్ళు నిరాశాపూరితంగా ఆలోచించకుండా, ఆత్మహత్య చేసుకునే లెవల్ వరకూ రాకుండా హాయిగా నిద్రపోయేలా చేయగలగడం.

తమకొచ్చే సమస్యలని నిర్మాణాత్మకంగా, సులభంగా ప్రదర్శించుకొనే విధానం పిల్లలకు తెలియకపోతే, వాళ్ళలో తులనాత్మక శక్తి నశించిపోయి, మానసిక వికాసం లేకుండా పోతుంది. పధ్నాలుగేళ్ళ కుర్రవాడు స్కూల్లో యింకో కుర్రవాడితో దెబ్బలాడాడే అనుకోండి అవతలి కుర్రవాడు 'మరుసటి రోజొచ్చి నీ పని పడతానురా' అని బెదిరించాడనుకోండి. అవతలి కుర్రాడు ఏదో మాటవరసకి ఆ మాట అనుండొచ్చు కానీ, మీ అబ్బాయి రాత్రంతా నిద్రపోడు. ఇలా ఏదయినా అశాంతి వుంటే వాడితో మాట్లాడి, గుర్తించి, ధైర్యం చెప్పి మరుసటి రోజు మీ కుర్రవాడితో స్కూలుకివెళ్ళి, అవతలి వాళ్ళతో మాట్లాడవలసిన భాధ్యత మీదే. ఒక వేళ మీ అబ్బాయి అశాంతిని మీరు గుర్తించని మరుక్షణం, తల్లిదండ్రులుగా మీరు మీ భాధ్యతను మరచిపోయారన్నమాట. కష్టం అంటే ఎవరికీ ఇష్టం వుండదు. అందరూ కష్టాలకి దూరంగా వుండాలనే అనుకుంటారు. అలా అనుకోవడంలో తప్పులేదుగానీ, అసలు కష్టాలే రాకుండా వుండాలనుకోవడం, వచ్చినపుడు వాటినుంచి దూరంగా పారిపోవాలనుకోవడం, పట్టించుకోకుండా వుండడం మంచిది కాదు. కష్టలు, సమస్యలు జీవితంలో ఓ భాగం అనే విషయాన్ని మనం మర్చిపోకూడదు. కష్టాలను మనం ఏ విధంగా ప్రతిస్పందిస్తున్నామనేది ముఖ్యం.

కష్టాలవల్లే జీవితం విలువ తెలుస్తుందనే విషయాన్ని మనం మన పిల్లలకు నేర్పాలి. పూతరేకుల మధ్య తీపి వున్నట్లు, కష్టాల మధ్యనే జీవన మాధుర్యం వుంటుంది. కష్టాలని కూడా జీవితంలో ఒక భాగంగా తీసుకొనే స్థాయికి ముందు మనం ఎదగాలి; మన పిల్లలు ఎదిగేలా చెయ్యాలి. 'తినగ తినగ వేము తియ్యనుండి' అన్నట్లు కష్టాలకి అలవాటుపడితే బాధకూడా మనని అంతగా బాధించదు.